ప్రజాశక్తి
శనివారం 29 జూన్ 2024 5 అనంతపురం

అనంతలో డెంగీ కలకలం

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరవింద్ నగర్‌లో ఓ మహిళకు డెంగీ లక్షణాలు కన్పించాయి. రెండు రోజుల క్రితం జిల్లాకేంద్రంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వెనుక ఉన్న అరవింద్ నగర్ లోని 45 ఏళ్ల మహిళకు డెంగీ లక్షణాలు కన్పించడంతో అధికారులు పరుగులు పెట్టారు. ఆ మహిళ గృహానికి వెళ్లిబయట నుంచి ఫోటోలు తీయించారు. ఆ మహిళ గృహ పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్, స్ప్రేయింగ్ జరిపి వచ్చారు.సీజనల్ వ్యాధుల నివారణకై ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను జరుపుతున్నారు అలాగే డెంగ్యూ నిరోధక మాసోత్సవాలను జూలై 1 నుండి 31 వరకు నిర్వహించనున్నారు. పారిశుద్య చర్యలే దోమల నివారణకు మార్గమని ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన గేటుకు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. డెంగీ నిరోధక మాసోత్సవాలు ప్రారంభం కాకమునుపే జూన్ నెలలోనే నగరంలో డెంగ్యూ కలకలం రేగడం గమనార్హం.

దర్జాగా కబ్జా...

- ◆ కొనుగోలు చేసింది ఒకచోట, కాజేసింది మరోచోట
- ◆ అధికారం మాటున ఏకంగా ఇంటి నిర్మాణం
- ◆ ప్రభుత్వం మారడంతో ధైర్యంగా ప్రశ్నిస్తున్న బాధితులు

కబ్జా చేసిన స్థలం

అధికారం కళ్లకెక్కింది... ఆ ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుని విర్రవీగిపోయారు. అందులోనూ ఆ వైసీపీ నాయకుడు ప్రతిపక్షాలను సైతం బెదిరించి తనకు ఎవరు పోటీ లేకుండా కౌన్సిలర్ అయ్యారు.దీంతో అధికారం మరింత మదమెక్కింది. కొనుగోలు చేసిన స్థలం ఎక్కడుందో ఆలోచించలేదు. తనకు నచ్చిన స్థలమే నాస్థలం అనుకున్నారేమో... ఓ వివాదాస్పద స్థలంలో ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలం యజమాని ఎంత గగ్గోలు పెట్టిన వినిపించుకోలేని అధికార మదం అకౌన్సిరల్‌ది. అంతేకాదు ఆ స్థలం ఆయన రిజిస్ట్రేషన్ చేసుకోక మునుపు నుంచే ఇద్దరి మధకోర్టులో వివాదం కొనసాగుతోంది. ఎంతో విలువైన స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం సాగించినా బాధితులు వారిని ఎదురించలేని బలహీనులు. ఆ కౌన్సిలర్ కొనుగోలు చేసిన స్థలం హద్దులు ప్రస్తుతం అతను స్వాధీనం చేసుకున్న స్థలం మధ్య హద్దులు తేడా ఉన్నా గమనించకుండానే అధికారం ఉందికదా తనను ఎవరు ఏమిచేయలేరన్న ధైర్యంతో ఖాళీగా కనిపించిన విలువైన స్థలంలో ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ప్రస్తుతం అధికారం మారడంతో బాధితులైన అసలు యజమాని ధైర్యంగా ముందుకు రావడంతో ఆ వైసీపీ కౌన్సిలర్ గుట్టు రట్టు అవుతోంది. ఈ భూ దందా వ్యవహారం ధర్మవరం పట్టణంలోని బాలాజీనగర్‌లో చోటు చేసుకుంది.

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణానికి చెందిన నాగరాజుకుమార్ 494 సర్వేనెంబరులోని 22.72 ఎకరాల పైకి తనకున్న 4సెంట్ల స్థలంతోపాటు మరో ఆరుసెంట్ల స్థలాన్ని 1980 నవంబరు 3వతేదీన రంగన అశ్వర్ధనారాయణ, రంగన అచ్చప్పలకు 4 సెంట్లస్థలాన్ని అమ్మేశాడు. ఇందుకు గాను తూర్పున రస్తా, ఉత్తరం రస్తా, దక్షిణం చుక్కలూరి చిన్ననారాయణ, పడమర సిరిపి రామచంద్రప్ప స్థలాన్ని చెక్‌బందీలుగా రిజిస్ట్రేషన్లో పొందుపరిచారు. అయితే 1989లో 494 సర్వేనెంబరులోని 1.86 ఎకరాలపైకి 2 సెంట్ల స్థలాన్ని షేక్‌అల్లాబకాష్ భార్య నసీమ్‌బేగం నుంచి అమీరాబాషా ఉరప్ తాత కొనుగోలు చేశారు. ఈ స్థలానికి గాను తూర్పు, ఉత్తరం రోడ్డు, దక్షిణం సిరిపి మస్తానమ్మ, పడమర బళ్లారి శ్రీరాములు స్థలాన్ని చెక్‌బందీగా రాయించుకున్నారు. ఇదే స్థలాన్ని 2001లో అమీర్ బాషా, ఉరపస్ తాత నుంచి కొనుగోలు చేశారు. తిరిగి 2010 జూన్ 24న గడ్డం కొండన్న కుమారుడు గడ్డం రంగనాథ్ కొనుగోలు చేశారు. రంగన అశ్వర్ధనారాయణ, రంగన అచ్చప్ప కొనుగోలు చేసిన స్థలానికి గడ్డం రంగనాథ్ కొనుగొలు స్థలాల మధ్య సర్వేనెంబరు ఒకటే ఉన్నప్పటికీ చెక్‌బందీగా వేరువేరుగా ఉన్నట్టు రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా తెలుస్తోంది. దీంతో గడ్డం రంగనాథ్, రంగన అశ్వర్ధనారాయణల మధ్య స్థలం వివాదాస్పదంగా మారింది. అందుకు ప్రధాన కారణం ఆ ప్రాంతంలో మిగిలిన ఉన్న కాళీస్థలం ఒక్కటే కావడం. కొలతలు నిర్వహించి అది ఎవరిదో నిర్ధారించుకోక మునుపే గడ్డంరంగనాథ్ ఆ స్థలం తనదే అంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో రంగన అశ్వర్ధనారాయణ, రంగన అచ్చప్పలు కూడా ఆ స్థలం తనదే నంటూ వారు కూడా కోర్టులో పిటిషన్ వేశారు. ప్రస్తుతం అది కోర్టులో విచారణ జరుగుతూ వస్తోంది. అయితే ఆ ప్రాంతానికి చెందిన ఓ కౌన్సిలర్ 2023లో గడ్డం రంగనాథ్‌ను సంప్రదించి వివాదాస్పద స్థలాన్ని తక్కువ రేటుకే కొనుగోలు చేసి కోర్టులో పెండింగ్ ఉన్నప్పటికి రిజిస్ట్రేషన్‌ను భార్య చింతా సరస్వతి పేరిట రాయించుకున్నాడు. అంతటితో ఆగని ఆ కౌన్సిలర్ ఏకంగా ఆ 2సెంట్ల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టి పెద్ద భవంతినే నిర్మించుకున్నాడు. ఆ కౌన్సిలర్‌కు వైసీపీ ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉండటంతో యథేచ్చగా ఆ వివాదాస్పదస్థలాన్ని ఆక్రమించుకొని ఇళ్లను నిర్మిస్తున్న ఏమిచేయలేని పరిస్థితి బాధితుల్లో నెలకొంది. ఇదేమని ప్రశ్నించిన బాధితులను బెదిరిస్తుండటంతో ఆకౌన్సిలర్‌కు భయపడి నిస్సహాయులుగా ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అధికారం మారడంతో ఇప్పుడిప్పుడే బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. తాజాగా రంగన అశ్వర్ధనారాయణ, రంగన అచ్చప్ప కూడా వైసీపీ ప్రభుత్వంలో తాము నష్టపోయిన వైనాన్ని ముందుకు వచ్చి వివరించే పరిస్థితి ఏర్పడింది.

కోర్టు పరిధిలో ఉన్నా లెక్కచేయని కౌన్సిలర్

పట్టణంలోని బాలాజీ నగర్ లోని 494 సర్వేనెంబరులో 4 సెంట్ల స్థలానికి సంబంధించి రెండుకుటుంబాల మధ్య వివాదం నెలకొంది. దీంతో 2021లోనే కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టులో వ్యవహారం నడుస్తోంది. కోర్టు వ్యవహారం ఉండగానే ఆ కోర్టు ఆదేశాలు కూడా లెక్కచేయని కౌన్సిలర్ గడ్డం రంగనాథ్‌ను లోబరుచుకుని తన భార్యపేరిట 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో లేదో ఏకంగా నిర్మాణం సాగించి పెద్ద భవనాన్నే ఏర్పాటుచేసుకున్నారు. తనకున్న పలుకుబడి అప్పటి ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉండటం వల్లనే ఆ కౌన్సిలర్ బరితెగించి ఏకంగా నిర్మాణాలు చేపట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. అధికారం ఉంటే ఏద్దైనా జయించుకోవచ్చుకున్నారేమో అన్నంత పనిచేసి ఎదుట వ్యక్తికి కన్నీళ్లనే మిగిల్చారు. వీటి మాటున వాటిపక్కనే ఉన్న మరో 2 సెంట్లను మరొకరు రిజిస్టర్ చేయించుకుని వాటిని కబ్జా చేయడంతో రంగన అశ్వర్ధనారాయణ, రంగన అచ్చప్ప నిట్టూర్పులు తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో పడ్డారు. అధికారులైన స్పందించి సర్వే నిర్వహించి ఆ స్థలం ఎవరిదే నిగ్గుతేల్చితే అసలు యజమాని ఎవరో బయటపడే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు.

బాలాజీనగర్ లో కబ్జాచేసిన స్థలంలో ఇంటినిర్మాణం చేపట్టిన దృశ్యం

పంట రుణాలు 10 శాతం మాత్రమే చెల్లించేలా చూడాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఏర్పడిన వరుస కరువు పరిస్థితుల దృష్ట్యా రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలు మొత్తం కాకుండా 10 శాతం రుణం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో ఏర్పడిన వరుస కరువుతో రైతులు వేసిన పంటలు పూర్తిగా నష్టపోయారన్నారు. పెట్టుబడి కూడా తిరిగి రాక అప్పులు ఊబిలో కూరుకుపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్పుల బాధ తాళలేక, కుటుంబపోషణ భారమై కొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకు అధికారులు పంటరుణాలు మొత్తం చెల్లించాలంటూ కోర్టు నోటీసులు జారీ చేయడం తగదని అన్నారు. పంటలు పండక, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను బ్యాంక్ అధికారులు కూడా ఇలా ఒత్తిడి తెస్తూ నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. లోక్ అదాలత్‌కు వచ్చి రైతులు బకాయి మొత్తం చెల్లించాలంటూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. రైతుల కష్టాలు గుర్తించి బకాయి మొత్తంలో 10 శాతం మాత్రమే చెల్లించేలా లోక్‌అదాలత్‌లో బ్యాంక్ అధికారులను ఆదేశించాలని వారు కోరారు.

హాస్టళ్ల మరమ్మతులకు రూ.1.35 కోట్లు మంజూరు

పజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల మరమ్మతులకు రూ.1,35,82,850 కోట్లు అనుమతి మంజూరైనట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.మధుసూధన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమ వసతిగృహాలను స్వయంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జెడ్పీ సిఇఓ వైఖోమ్ నిదియాదేవి, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు తనిఖీ చేయించిన నేపథ్యంలో మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేసినట్లు జెడి తెలిపారు. 10 సంక్షేమ వసతిగృహాలు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. కలెక్టర్‌కు జెడి మధుసూధనరావు ధన్యవాదాలు తెలిపారు.

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ గా ఆచార్య ఎస్వీ.సత్యనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌వి. సత్యనారాయణ

అనంతపురము జెఎన్‌టియు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ఆచార్య యస్.వి. సత్యనారాయణ శుక్రవారం భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తనవంతకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు, బోధన బోధనేతర, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నూతన రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని పింఛన్ దారులకు జూలై 1వ తేదిన యధాతదంగా ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద పింఛన్ సొమ్ము అందజేయనున్నట్లు డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్టీఆర భరోసా పింఛన్ పథకము అమలు చేస్తోందన్నారు

సిటీ స్కానింగ్ కేంద్రం మార్పు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని స్కానింగ్ కేంద్రం

అనంతపురం అర్బన్ : అనంతపురం సర్వజన వైద్యశాలలోని సిటీ స్కానింగ్ కేంద్రాన్ని మార్చినట్లు కేంద్రం మేనేజర్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మార్చినట్లు తెలిపారు. గతంలో స్కానింగ్ పరికరం సామర్థ్యం 16 స్లాస్ కాగా ప్రస్తుతం 32 స్లాస్ సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్కానింగ్ అవసరమైన రోగులను సర్వజన ఆస్పత్రి నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అంబులెన్స్‌లో రోగులను తరలించనున్నట్లు చెప్పారు. మరో రెండు,మూడు రోజుల్లో స్కానింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

డయేరియా బాధితులకు ప్రత్యేక వార్డు

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

డయేరియా బాధితుల కోసం అనంతపురం సర్వజన వైద్యశాలలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో డయేరియా విజృంభించడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 63 డయేరియా కేసులు నమోదు కాగా, 13 మంది చిన్న పిల్లలు ఉన్నట్లు చెప్పారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

డయేరియా వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

పోలీసు బందోబస్తు మధ్య ఎరుకులయ్య అంత్యక్రియలు

అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎరుకులయ్య (55) అంత్యక్రియలు నిర్వహించారు. ఈనెల 19న కోమటికుంట్లలో వైసిపి-టిడిపిల మధ్య జరిగిన ఘర్షణలో ఎరుకలయ్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీంతో చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం ఇద్దరు డీఎస్పీలు, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, సిఐలు బికెఎస్, శింగనమల, పుట్లూరు ఎస్ఐలు ఇటుకలపల్లి, ఎస్ఐలు, గార్లదిన్నె ఎస్ఐతోపాటు వివిధ విభాగాలకు చెందిన 50 మంది పోలీసుల మధ్య సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, పుట్లూరు ఎంపిపి రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పలు విభాగాలపై సమీక్షలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి క్లయిమ్ సెటిల్మెంట్ కమిటీ, రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 39 బ్లాక్ స్పాట్‌లను గుర్తించినట్లు చెప్పారు. అక్కడ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, బ్లాక్ స్పాట్‌లలో లైటింగ్, బోర్డ్, సిగ్నల్ లాంటివి ఏర్పాటు చేయాలని, ఇందు కోసం ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. జాతీయ రహదారుల్లో కొన్నిచోట్ల మెయింటెనెన్స్ బాలేదని, ఆయాచోట్ల ప్లాంటేషన్, లైటింగ్ చేపట్టాలని సూచించారు. ఎన్జీవోలు రాబోయే రోజుల్లో ఇంకా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతివారం ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. రోడ్డు భద్రతపై స్లోగన్స్ ప్రదర్శించాలని, కలెక్టరేట్ వద్ద డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో 40 సీసీ కెమెరాల ఇన్స్టలేషన్ పూర్తి చేయాలని, దాని ఫీడ్ పోలీస్, జిల్లా కంట్రోల్ రూమ్‌లోకి రావాలన్నారు. నగరంలో తపోవనం, సాక్షి ఆఫీస్ రూట్‌లో లైటింగ్ ఏర్పాటు, కళ్యాణదుర్గం రోడ్‌లో లైట్స్ ఏర్పాటు వారం రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నేషనల్ హైవే హెల్ప్ లైన్ (ఎమర్జెన్సీ) నెంబర్ 1033 పై విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. పాడైన డ్రంక్ అండ్ డ్రైవ్ పరికరాలను మరమ్మతులు చేయించాలన్నారు. నగరంలో పలుచోట్ల నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను నివారించాలని, నగరంలోని పోలీస్ కంట్రోల్ బంకు వద్ద, ఓల్డ్ టౌన్ కూరగాయల మార్కెట్, పిటిసి, తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను వారం రోజులు సమయం తీసుకుని పరిష్కరించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ ప్రాంతాలను మార్చడం, లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయి క్లయిమ్ సెటిల్మెంట్ కమిటీ సమావేశంలో భాగంగా జనవరి నుంచి 20 కేసులు నమోదు కాగా, ఆయా కేసులకు సంబంధించి తహశీల్దార్లు మూడు రోజుల్లోగా రిపోర్టులను అందించాలని ఆదేశించారు. అనంతరం వారం రోజుల్లోపు క్లయిమ్ సెటిల్మెంట్ చేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50 వేలు, మరణించిన వారికి రూ.2 లక్షలు క్లయిమ్ చేయవచ్చని, పెండింగ్ క్లయిమ్ సెటిల్మెంట్ పూర్తిగా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిటిసి వీర్రాజు, డీఎస్పీ ఆంథోనప్ప, ట్రాఫిక్ సిఐ నారాయణరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టిసి ఆర్ఎం సుమంత్, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్,బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, ఈఈ ప్రసాద రెడ్డి, ఆర్‌డిటి కోఆర్డినేటర్ తిప్పేస్వామి, వివిధ శాఖల అధికారులు, ఎన్‌జిఓలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై గట్టి నిఘా ఉంచాలి :

జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్. ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్‌సిఓఆర్‌డి (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, ఎన్‌సిఓఆర్‌డి) జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్, లాంటివి సాగు, రవాణా చేయకుండా చూడాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో గతేడాది జూన్ నుంచి నవంబర్ వరకు కెనాబీస్, ఆల్కహాల్, గంజాయిలాంటి కేసులు నమోదు అయ్యాయని అన్నారు. వైజాగ్, శ్రీకాకుళం నుంచి అనంతపురం మీదుగా బళ్లారి వెళుతున్న ప్రైవేట్ బస్సులను తనిఖీలు చేయాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రయాణికులను కూడా తనిఖీ చేయాలని సూచించారు. పాఠశాలలు, హైస్కూల్‌లలో కమ్యూనిటీ డ్రైవ్ చేపట్టాలన్నారు. జిల్లాలోని రెస్టారెంట్‌లు, హోటల్స్, బార్లలో మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అవగాహన కల్పించేందుకు పోస్టర్‌లను ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా నశాముక్త భారత్‌లో భాగంగా ఎన్‌హెచ్ఎం, ఐఈసీ యాక్టివిటీల కింద " జస్ట్ సే నో టు డ్రగ్స్, సే నో టు డ్రగ్స్" అనే పోస్టర్‌లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, సెబ్ అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, డిటిసి వీర్రాజు, అనంతపురం ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, డీఈఓ వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, హార్టికల్చర్ డిడి రఘునాథరెడ్డి, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డివిఇఓ వెంకటరమణ నాయక్, ఏసిఐఓ శ్రీధర్ బాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఎక్కువసార్లు రక్తం చేసిన దాతలకు మెమెంటో అందజేస్తున్న కలెక్టర్

రక్త నిధి కేంద్రాల్లో అన్ని గ్రూపుల రక్తం అందుబాటులో ఉండాలి :

రక్తనిధి కేంద్రాల్లో అన్ని వేళలా అన్ని గ్రూపుల రక్తం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రెడ్ క్రాస్ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రతి వారం ఒక రక్తదాన శిబిరం నిర్వహించాలని, ప్రతి శిబిరంలోనూ కనీసం 100 యూనిట్ల రక్తం సేకరించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అందులో కాలేజీలు, సంస్థలు, బ్యాంకులు, కర్మాగారాలతో పాటు ప్రభుత్వ శాఖలు ఉండేలా చూడాలన్నారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని, దానికి తమ వంతు సహాయం చేస్తామన్నారు.. జిల్లాలోని స్వచ్ఛంద సేవకులు, అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ సభ్యతం తీసుకోవాలని, తానూ కూడా రెడ్ క్రాస్ జీవిత సభ్యునిగా చేరుతున్నాని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కువసార్లు రక్తదానం చేసిన పలువురికి జిల్లా కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెడ్ క్రాస్ మేనేజింగ్ మెంబర్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబి. దేవి, అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్ కంట్రోల్ అథారిటీ రమేష్ రెడ్డి, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మోతాదులో క్రిమిసంహారక మందులు వాడాలి

మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు మద్దిలేటి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వేరుశనగలో మిత్ర, శత్రు పురుగులను గుర్తించి తగు మోతదులోనే క్రిమిసంహారక మందులను వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు మద్దిలేటి సూచించారు. శుక్రవారం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో 'సాగుకు సమయత్తం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లోతుగా దుక్కులు చేసుకోవాలన్నారు. అంతకు ముందుగా మట్టి నమూనా పరీక్షలు చేయుంచుకుని వారు ఇచ్చిన సలహా మేరకు ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. మంచి విత్తనాన్ని ఎన్నుకోవడంతోపాటు శుద్ధి చేసుకుని విత్తు కోవాలన్నారు. సరైన క్రమంలో నీటి తడులు అందివ్వాలన్నారు. సూక్ష్మ పోషక ఎరువులను ప్రతి రెండు పంటలకు ఒకసారి వినియోగించుకోవాలని సూచించారు. పురుగుల ఉధృతిని బట్టి మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ శైలజ, రైతులు, రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

డ్రైడే పాటిద్దాం..రోగాలను అరికడదాం

జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు

పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి రోగాలను అరికడదామని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉరవకొండతోపాటు మండలంలోని చిన్న ముష్టూరు, ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి డ్రమ్ములు, నీటి తొట్టెలను పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు ఉంచితే దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదన్నారు. అలాగే ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి చంద్రమౌళి, రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పావని, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, అమిదాల జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగమంజుల, పంచాయతీ కార్యదర్శులు గౌస్‌సాహెబ్, కె.మహబూబ్‌బాషా, వైద్య సిబ్బంది నాగరంగయ్య, శేఖర్, రాఘవేంద్ర, కోమలాదేవి, ఎం.ఛాముండేశ్వరి, హేమలత, వి.భవాని, ఎస్.భారతి, హిమబిందు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పారిశుధ్యం పనులు చేయిస్తున్న మాజీ సర్పంచి అట్టే రామాంజనేయులు

ప్రజాశక్తి-శింగనమల

ప్రతిఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ సర్పంచి అట్టే రామాంజనేయులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని శోదనపల్లిలో సొంత నిధులతో డ్రెయినేజీ కాలువలతోపాటు గ్రామంలో శ్రమదానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నుంచి అటు అధికారులు, ఇటు నాయకులు గ్రామంలో పేరుకుపోయిన డ్రెయినేజీ కాలువను పట్టించుకోలేదన్నారు. ఈనేపథ్యంలో డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో శ్రమదానం చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తులు కూడా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా బీసీ కాలనీలో ఉన్న ఎంపీపీ స్కూల్, ఎస్సీ ఎంపీపీ పాఠశాలల సమీపంలో డ్రెయినేజీలు ఉండటంతో ప్రజల విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డ్రెయినేజీని శుభ్రం చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పేట శివారెడ్డి, పేట ప్రసాద్‌రెడ్డి, అమ్మలదిన్నె ఆదినారాయణ, అట్టే శ్రీనివాసులు, అట్టే శంకరయ్య, చిన్న చౌడప్ప, డాల్ వీరనారాయణ, పేట బయన్న, డాల్ రమేష్, రమణ, గురుమూర్తి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టిగా రాయదుర్గాన్ని అభివృద్ధి చేద్దాం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వెనుకబడిన రాయదుర్గం ప్రాంతాన్ని సమిష్టిగా అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రాయదుర్గంలోని సీతారామాంజనేయ సత్రంలో బిజెపి తాలూకా అధ్యక్షులు హీరోజీరావు అధ్యక్షతన జరిగిన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలతోపాటు రాయదుర్గంలోనూ ఎన్‌డిఎ కూటమి అధికారంలో ఉన్నందున అందరి భాగస్వామ్యంలో మంచి పరిపాలన అందిస్తామని తెలిపారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి వరం అన్నారు. రైతులు, కూలీలు, బీసీలు, మైనార్టీలు, మహిళల సమస్యలను కలిసికట్టుగా పరిష్కరిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధర, రాయదుర్గం పట్టణ అధ్యక్షులు వి.అంబాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సి పనులు పరిశీలన

బొమ్మనహాల్ : మండలంలోని తుంగభద్ర ప్రధాన కాలవను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర ప్రధాన కాలువను ఆంధ్రాలో ఆధునీకరణ ఆగిపోయిందన్నారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి ఆధునీకరణ పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు కేశవరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తింటున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల వద్దకు రాగానే నేరుగా భోజనం తయారు చేసే గదికి వెళ్లి పాత్రల్లో ఉన్న అన్నం, కూరలను పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేకుండా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం భోజనం చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి పలు విషయాలపై ఆరాతీశారు. విద్యా బోధనతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను పిలిచి తాగుతున్న నీటికి పరీక్షలు చేయాలని ఆదేశించారు. తర్వాత గత వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన గోడల నిర్మాణం, అర్ధాంతరంగా నిలిపిన భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. వెంటనే భోజనశాల నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే మరుగుదొడ్లు లేకపోవడంతో వెంటనే ఉన్నతాధికారులకు రిపోర్టు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అలాగే టీచర్ల కొరతపై ఆరాతీస్తూ త్వరలోనే హిందీ టీచర్ రిటైర్డ్ అవుతారని, హిందీ టీచర్‌ను వెంటనే నియమించేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు. జిల్లా విద్యా శాఖాధికారికి లేఖ రాయలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమన్‌నాయక్, ఎంఇఒ-2 లింగానాయక్, నాయకులు పసుపుల హనుమంతురెడ్డి, పొడరాళ్ల రవీంద్ర, ఓబుళపతి, దండువారిపల్లి ఆదినారాయణ, మల్లేశు, కేసన్న, అధికారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో 'ఉమాపతి' సేవలు మరువలేనివి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈబీ. దేవి

మాస్ మీడియా అధికారి లేపాక్షి ఉమాపతిని సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో మాస్ మీడియా అధికారి లేపాక్షి ఉమాపతి సేవలు మరువలేనిదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భ్రమరాంబదేవి కొనియాడారు. లేపాక్షి ఉమాపతి పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కాన్ఫరెన్స్ హాల్లో ఆత్మీయ సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమాపతి వైద్య ఆరోగ్య శాఖలో కీలకమైన పాత్ర పోషిస్తూ శాఖ అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సేవలను నిరంతరం ప్రజలకు చేరవేయడంలో మాస్ మీడియా పాత్ర కీలకమైందన్నారు. మాస్ మీడియా నాయకత్వ బాధ్యత క్షేత్రస్థాయిలో ఉమాపతి నిర్వహించిన తీరు పలువురికి ఆదర్శమన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడంతోపాటు ఆ శాఖకు పూర్తిస్థాయి న్యాయం అందించేందుకు ఆయన పడిన తపన గొప్పదన్నారు. ఉమాపతి మాట్లాడుతూ తనకు వైద్య ఆరోగ్యశాఖ ప్రజలకు సేవ చేసేందుకు గొప్ప అవకాశం కల్పించిందన్నారు. జూన్ 30వతేదీ తన ఉద్యోగ బాధ్యతల నుండి పదవి విరమణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో విభాగం ప్రతినిధి త్యాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కమలాకర్, రాజు, ఏవో గిరిజా, మనోహర్‌రావు, గంగాధర్, రామలక్ష్మి, ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, పలువురు వైద్యులు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి ఆత్మహత్య

మృతిచెందిన రేణుక

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని దంచర్ల గ్రామానికి చెందిన రేణుక (20) ఇంట్లోని సీలింగ్ హుక్కుకు ఉరేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రేణక కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. తల్లిదండ్రులు చాలాచోట్ల చూపించినా నయం కాలేదు. నెలసరి వచ్చేసరికి తీవ్ర కడుపు నొప్పితో ఇబ్బందులు పడేది. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయిన తర్వాత ఇంట్లోని సీలింగ్ కొండికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఉదయం లేచి చూసేసరికి అప్పటికే మృతి చెందిందన్నారు. ఈమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి దారుణహత్య

హత్యకు గురైన వన్నూరుస్వామి

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోటలో వ్యక్తి శుక్రవారం దారుణహత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... కురాకులతోటకు చెందిన వన్నూరుస్వామి (30) పట్టణంలోని హోటల్‌లో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో సాయంత్రం కురాకులతోట నుంచి దొడగట్టుకుపోయే దారిలో కొండ సమీపంలో వన్నూరుస్వామి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని తెలుస్తోంది. నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో అటుగా వెళ్లి పతకం ప్రకారమే మద్యం తాపించి హత్య చేసినట్లు సమాచారం. మృతునికి భార్య శ్రీవాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ సీఐ హరినాథ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్వపురాలను సేకరిస్తున్నారు.

మాజీ ఉపసర్పంచి సతీమణి లక్ష్మీదేవి మృతి

నార్పల : మండల కేంద్రంలోని కోటవీధికి చెందిన మాజీ ఉపసర్పంచి కల్లు లక్ష్మీనరసయ్య సతీమణి లక్ష్మీదేవి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం దహన సంస్కారాలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటికెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనాథాశ్రమానికి ఆర్థికసాయం

అనాథాశ్రమానికి ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

గుత్తి : పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, అనాథాశ్రమాలకు విశ్రాంత ట్రాన్స్ కో ఉద్యోగి జి.గోపాల్ కుటుంబ సభ్యులు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. జి.గోపాల్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.12 వేలు ఆర్థికసాయాన్ని ఆశ్రమ నిర్వాహకుడు జగన్నాథానికి అందజేశారు. ప్రతిఏటా తమవంతు సాయంగా ఆశ్రమానికి రూ.12వేల చొప్పున ఇస్తున్నామని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్ భార్య రంగమ్మ, కుమారులు హరికృష్ణ, సునీల్‌కుమార్, అరవింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

వజ్రకరూరు : ఉరవకొండ కోర్టులో శుక్రవారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకళ్యాణి శుక్రవారం ఒక పకటనలో తెలిపారు. ఏపీ హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

గుత్తి : మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు చెందిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు శుక్రవారం రాజీనామా చేశారు. పి.ఎర్రగుడి,కొత్తపేట, బేతాపల్లి, ఊబిచెర్ల, లచ్చానుపల్లి, అబ్బేదొడ్డి, పెద్దొడ్డి తదితర గ్రామాలు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు తమ రాజీనామా పత్రాలను ఎంపిడిఒ శ్రీనివాసులకు అందజేశారు.

మంత్రిని కలిసిన పుట్లూరు నాయకులు

మంత్రికి బొకే అందజేస్తున్న పుట్లూరు మండల టిడిపి నాయకులు

పుట్లూరు : బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను పుట్లూరు మండల టిడిపి నాయకులు కడవకల్లు గోవర్ధనరాజు, హర్షవర్ధనచౌదరి, నాగార్జుననాయుడు శుక్రవారం పెనుకొండలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

1న ప్రపంచ వైద్యుల దినోత్సవం

అనంతపురం : ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 1వతేదీన సోమవారం అనంతపురంలోని వైద్య కళాశాలలోని సుశ్రుత లెక్చర్ హాల్‌లో ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రజారోగ్య వేదిక ప్రతినిధి పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి.రమణయ్య హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డిఎం

కళ్యాణదుర్గం : ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం సాయంత్రం డయల్ యువర్‌ఆర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలతోపాటు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సమస్యలు తెలియ జేయాలనుకునేవారు సెల్..99592 35862 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు.

విద్యాదానం గొప్పది..

బెలుగుప్ప : అన్నిదానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాలువపల్లి, అనిమిరెడ్డిపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఎజిఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రమీల పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ పాటించి మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ట్యాంకర్‌తో నీరు సరఫరా

నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

పామిడి : మండలంలోని రామగిరి ఎగువతండాకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు జయరామ్ ఈశ్వర్ ఓ మినరల్ వాటర్ ట్యాంకు ద్వారా నీరు సరఫరా చేశారు. రెండు రోజుల క్రితం తండాలో పర్యటించిన ఈశ్వర్‌కు గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, కలుషిత నీరు తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన నీటిని శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసేంత వరకూ ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు ట్యాంకర్‌ను అందజేశారు. దీంతో గ్రామస్తులు గుమ్మనూరు ఈశ్వర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎగువతండా గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాయదుర్గం ఎంపిడిఒ అల్లాబకాష్

1న ఇళ్ల వద్దకే పింఛను

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వచ్చేనెల 1వతేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సామాజిక పింఛన్ల పంపిణీ చేయాలని ఎంపిడిఒ అల్లాబకాష్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై మండల స్థాయి, వెల్ఫేర్ అసిస్టెంట్, వెలుగు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఒక్కో ఉద్యోగి 50 మంది చొప్పున పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. 1వ తేదీనే వందశాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలన్నారు. అదికూడా లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము ఇవ్వాలన్నారు. ముందుగా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : మండలంలోని పెన్షన్ల లబ్ధిదారులకు వచ్చేనెల 1వ తేదీనే సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయాలని ఎంపిడిఒ రఘునాథ్ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి రూ.3.60 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంపిణీలో ఇలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

బెలుగుప్ప : వచ్చేనెల 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పథకం కింద పకడ్బందీగా పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5,857 మంది పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జగదీష్, గోపాల్, శమంతకమణి, శోభన్‌బాబు, వెంకటేశులు, ప్రవీణ్‌కుమార్, రామ్మూర్తి, ఉమాదేవి, శ్రీరాములు, అశోక్, ఉమాశంకర్, రవికుమార్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : వచ్చేనెల 1వతేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తారన్నారు.

పుట్లూరు : మండలంలోని 1వ తేదీన లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపిడిఒ దస్తగిరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ 1వతేదీన పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, ఎపిఎం వెంకట్రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ తన కుమారుడు కవీన్ ఆదిత్యతో అన్నదానం చేయించడం ఎంతో ఆనందం ఉందన్నారు. ప్రత ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, చంద్రశేఖర్, జగన్నాథ్, రవికుమార్, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

గుమ్మగట్ట : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సర్పంచి జయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి జయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలతోపాటు నోటు బుక్కులు, బెల్టు, బ్యాగు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యోగేంద్రనాథ్, టీచర్ రమ్య, టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన సదస్సు

పామిడి : స్థానిక అంగన్వాడీ సెక్టార్ కాలవగడ్డ-1 సెంటర్‌లో డయేరియా, మలేరియా వ్యాధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ మల్లేశ్వరి, సూపర్‌వైజర్ రామలక్ష్మి మాట్లాడుతూ డయేరియా, మలేరియా ప్రబలుతున్న తరుణంలో ప్రజలు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అతిసార వ్యాధి రాకుండా సక్రమంగా హ్యాండ్‌వాషింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం స్టాఫ్ డయేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం మహేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

గుమ్మగట్ట : మండల కేంద్రంలోని అంగన్వాడీ-1 కేంద్రంలో ఎంపిడిఒ గౌరీదేవి అధ్యక్షతన శుక్రవారం డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అంగన్వాడీల పరిధిలోని పిల్లల తల్లిదండ్రులకు డయేరియాపై అవగాహన కల్పించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ మురళీధర్, హెల్త్ సూపర్‌వైజర్ ఆది బయమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజనమ్మ, అంగన్వాడీలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా
ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

IN THE COURT OF THE
SENIOR CIVIL JUDGE, PENUKONDA.
O.S. No.70/2017

Between:
B.S. Sivappa ... Plaintiff
And
B.S.Chinna Peddanna died by LRs and Others ... Defendantes

Summon to Defendant No:8

To,
D8:- M.Santhamma W/o M.Venkata Ramappa aged about 48years, Hindu, Agriculturist D.No.4-27B Sadar Veedhi, Atmakur (Vi) and (M)

ఇందుమూలముగా నీకు తెలియజేయునది ఏమనగా B.S.శివప్ప S/o. B.S.సంజీవప్ప, D.No.5-332, శ్రీరాములయ్య కాలనీ, పెనుకొండ టౌన్ మరియు మండలం అనునతను నీ మీద వేసిన దావా O.S. 70/2017 పై కోర్టులో 08-07-2024వ తేదీన వాయిదా వున్నది. పై తేదీన నీవు ఖుద్దున గాని లేక వకీలు ద్వారా గాని పై కోర్టు యెందుట ఉదయము గం॥10-30ని॥లకు హాజరు కావలయును.

అట్లు హాజరుకాని యెడల పై వ్యాజ్యము నీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా నీకు తెలియజేయడమైనది.

"కోర్టు వారి ఉత్తర్వు మేరకు"
ఇట్లు: బి. మల్లిరెడ్డి
వాది తరపు వకీలు

CHANGE OF NAME

I, KAMISETTY SUMALATHA (Old Name) W/o VIDYASAGAR PONUGANTI ESWARA CHANDRA residing at # 18-1-290, Venugopal Nagar, Anantapur -515001, Anantapur (Dist.) Changing my name from KAMISETTY SUMALATHA to PONUGANTI SUMALATHA (New Name). Hence for, I am being called as PONUGANTI SUMALATHA for all purposes.